# ఓటరు కార్డు..గుర్తింపు కోసమేనా.!

- కంటోన్మెంట్ పరిధిలో మొత్తం ఓటర్లు 2,53,706
- ఓటు హక్కును వినియోగించుకున్నవారు 1,30,929
- ఓటు వేయని వారు 1,22,777 మంది
- పోలింగ్ శాతం 51.61



సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం

కంటోన్మెంట్, మే 17: ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో కీలకమైంది. ఓటు బ్రహ్మాస్త్రంతో దేశ భవితను మార్చే అవకాశముంది. ఓటుతో మంచి నాయకుడిని ఎన్నుకోవడం ద్వారా మన ప్రాంతమే కాకుండా దేశ దశ దిశను మార్చే శక్తి ఓటుకే ఉందనడంలో సందేహం లేదు. ఒక్క ఓటు తేడాతో ఓడిన వారు చాలా మందే ఉన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌తో పాటు జిల్లా అధికార యంత్రాంగం విస్తృతంగా చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. ఓటు ప్రాధాన్యతపై పలు స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పించాయి. పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈ నెల 13న నిర్వహించిన లోక్‌సభ ఎన్నికలతో పాటు కంటోన్మెంట్‌లో నిర్వహించిన ఉప ఎన్నికలో చాలా మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోకుండా నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో 2,53,706 మంది ఓటర్లు ఉండగా, అందులో 1,30,929 మంది తమ ఓటుహక్కును వినియోగించున్నారు. మిగతా 1,22,777 మంది ఓటు వేయలేదు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో 51.61 శాతం పోలింగ్ కావడం గమనార్హం.

### గుర్తింపు కార్డు కోసమేనా....!

ఓటరు జాబితాలో పేరు నమోదుకు ఎంతో శ్రద్ధ చూపెట్టారు. 18 ఏళ్లు నిండిన వెంటనే ఓటు నమోదు చేయిస్తారు. ఎన్నికల గుర్తింపు కార్డు రాకుంటే అధికారులతో మాట్లాడి తీసుకుంటారు. ఓట్ల పండగ వచ్చే సరికే దూరంగా ఉంటున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఇతర ప్రాంతాల్లో ఉంటే పిలవడం లేదు. దూరభారం అవుతుందని ఎందుకు ఇంత దూరమని చెప్పడంతో వారు కూడా వచ్చేందుకు ఆసక్తి చూపడంలేదు. ఓటరు కార్డును ఒక గుర్తింపు కార్డు కోసమే వాడుతున్నారు.

## పుష్పక్ ఏసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలి


పుష్పక్ ఏసీ బస్సును సందర్శించిన ఈడీ వెంకటేశ్వర్లు ,కంటోన్మెంట్ డిపో మేనేజర్ రామ్మోహన్

మారేడ్‌పల్లి,మే 17:నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి శంషాబాద్ ఏయిర్‌పోర్టుకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం 24 గంటల పాటు పుష్పక్ ఏసీ బస్సులను ఏర్పాటు చేసినట్లు నగర జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు తెలిపారు.శుక్రవారం సికింద్రాబాద్ జేబీఎస్‌లోని పుష్పక్ ఏయిర్ పోర్టు బస్ షెల్టర్‌ను ఆయన సందర్శించి,ప్రయాణికులకు గులాబీ పుష్పాలు అందజేసి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్‌ఎం.ఖాన్,డిప్యూటీ ఆర్‌ఎం.భీమ్ రెడ్డి,కంటోన్మెంట్ డిపో మేనేజర్ రామ్మోహన్,క్రిష్ణ పాల్గొన్నారు.

## అధ్యాపకులను బదిలీ చేయాలని వినతి


విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంకు వినతి పత్రం అందజేస్తున్న అధ్యాపకులు

నేరేడ్‌మెట్, మే 17 : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులను బదిలీ చేయాలని తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ ఈ.బ్రిజేష్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఐదేండ్ల నుంచి బదిలీలు జరుగలేదని ప్ర స్తుతం ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా నుంచి పర్మిషన్ తీసుకొని బదిలీలను వెంటనే కొనసాగించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.


ఉత్తీర్ణత శాతంతో విజయ కేతనం చూపిస్తున్న ప్రిన్సిపాల్ వనజ,కరస్పాండెంట్ పి.ఎల్ శ్రీనివాస్, విద్యార్థులు

## అక్షర వాగ్దేవి విద్యార్థుల అద్భుత విజయాలు

కంటోన్మెంట్,మే 17:సికింద్రాబాద్ అక్షర వాగ్దేవి ఇంటర్నేషనల్ 2023-2024 విద్యా సంవత్సరంలో అత్యుత్తమ విజయాలు, 100 శాతం ఉత్తీర్ణత సాధించడం గర్వంగా ఉందని ప్రిన్సిపాల్ వనజ తెలిపారు.విద్యార్థులు,అధ్యాపకులు,తల్లిదండ్రుల నిబద్ధతకు ఈ ఫలితాలు నిదర్శనమని పల్లవి ఎడ్యుకేషనల్ గ్రూపు చైర్మన్ మల్కా కొమురయ్య అన్నారు.ఈ మేరకు శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడానికి,ప్రతి విద్యార్థి సమగ్ర అభివృద్ధిని పెంపొందించడానికి తమ నిబద్ధతను చాటుతామని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అక్షర వాగ్దేవి ఇంటర్నేషనల్ కరస్పాండెంట్ పి.ఎల్.శ్రీనివాస్,డైరెక్టర్ సుశీల్ కుమార్, సుధ,మురళీ క్రిష్ణ,మల్కా యశస్వి, రచన సింగ్,ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భద్రత కోసం సీసీ టీవీ కెమెరాలు

### ప్రారంభించిన బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్


సీసీటీవీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఆలయ చైర్మన్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్

కంటోన్మెంట్, మే 17: ప్రతి ప్రాంతంలో భద్రతకు పెద్దపీట వేయాలనుకుంటే సీసీ టీవీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం న్యూ బోయిన్‌పల్లి బాపూజీనగర్ శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలను ఆలయ చైర్మన్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ.. ఒక్క సీసీ టీవీ కెమెరా వందమంది కానిస్టేబుళ్లతో సమానమన్నారు. ఆలయాలు, వ్యాపార వాణిజ్య సముదాయాలు, ఇళ్లల్లో సీసీటీవీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ముత్యాలమ్మ ఆలయంలో దాత అరుణ్ యాదవ్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సంతోష్ శర్మ, దుర్గయ్య, బండారి లక్ష్మణ్, కరణ్ సింగ్, కృష్ణ, అజిత్ కళ్యాణ్, కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

## సమసమాజ స్థాపనకు కృషి చేయాలి


ఆర్ట్స్ కళాశాల ఆవరణలో కలేకూరి ప్రసాద్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 17: సామాజిక విప్లవకారుడు కలేకూరి ప్రసాద్ 11వ వర్ధంతిని ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) ఓయూ అధ్యక్షుడు నామ సైదులు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కలేకూరి ప్రసాద్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. సమ సమాజ స్థాపన కోసం పోరాడిన సామాజిక విప్లవవీరుడు, గొప్ప రచయిత, కవి, సాహితీవేత్త, అనువాదకుడు అని గుర్తు చేశారు. శక్తివంతమైన తన రచనలతో సమాజాన్ని మేల్కొలిపిన ఆయన అంబేద్కరిజం, మార్క్సిజంను తన నరనరాన జీర్ణించుకున్నాడని వివరించారు. తన చివరి శ్వాస వరకు సమసమాజ స్థాపన కోసం పోరాటం సాగించారని ప్రశంసించారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ అంకితమవ్వాలని పిలుపునిచ్చారు.



### మహంకాళి అమ్మవారికి కార్పొరేటర్ ప్రత్యేక పూజలు

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం బేగంపేట్ కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు దంపతులకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనం ఇచ్చారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలన్ని అమ్మవారిని ప్రార్థించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. - బేగంపేట్

## పేదలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

హిమాయత్‌నగర్: నగరంలో పేదలు నివసించే ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని సీపీఐ నగర కార్యదర్శి ఎస్.ఛాయాదేవి డిమాండ్ చేశారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్‌ఎన్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించాలన్నారు. పదేండ్లలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేయడం వల్ల పేద కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడ్డాయని ఆరోపించారు. నిరుద్యోగం పెరగడంతో ప్రజలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

## పురస్కారం మరింత బాధ్యత పెంచింది


కల్లేపల్లి రాజుకు డాక్టర్ చిక్కా దేవదాసు 2024 పురస్కారాన్ని అందజేస్తున్న దృశ్యం

సికింద్రాబాద్,మే17: సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త కల్లేపల్లి రాజు నేతకి డాక్టర్ చిక్కా దేవదాసు ప్రతిభా పురస్కారం 2024 అవార్డు లభించింది. చేనేత వర్గాల వారికి గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి ప్రధాన కార్యదర్శిగా అందజేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ఆయనకు చిక్కా దేవదాసు జన్మ దినోత్సవం సందర్భంగా ఈ పురస్కారం అందజేశారు. ఇటీవల నగరంలోని త్యాగరాయ గాన సభలో కళా నిలయం సాంస్కృతిక సంస్థ ఓంకార సత్సంగం ఆధ్యాత్మిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పద్మశ్రీ అవార్డు గ్రహీత కొలకలూరి ఇనాక్ ,మాజీ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సుంకరి సత్య నారాయణ, చిక్కా రామదాసు ,టీఎస్ఆర్జేసీ పూర్వ ప్రిన్సిపాల్ చందు ఆంజనేయులు చేతుల మీదుగా కల్లేపల్లి రాజు నేత అవార్డు అందుకున్నారు. అనంతరం కల్లేపల్లి రాజు నేత మాట్లాడుతూ.. డాక్టర్ చిక్కా దేవదాసు 2024 ప్రతిభా పురస్కారం తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో సురేందర్ పుష్ప నేత పాల్గొన్నారు.


కనకదుర్గమ్మను దర్శించుకున్న

### ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీగణేష్

విజయవాడలోని కనకదుర్గమ్మ అమ్మవారిని కంటోన్మెంట్ నేతలతో కలిసి శుక్రవారం కంటోన్మెంట్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీ గణేష్ దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం శ్రీ గణేష్ మాట్లాడుతూ.. కంటోన్మెంట్‌లో ఎగిరేది కాంగ్రెస్ జెండానే అని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, పార్లమెంట్ స్థానాలను సైతం అత్యధికంగా హస్తగతం చేసుకోబోతున్నట్లు వెల్లడించారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో కాంగ్రెస్ నేతలు ముప్పిడి మధుకర్, భాస్కర్, శేఖర్ ముదిరాజ్, నర్సింగ్, సాయి, రాము తదితరులు ఉన్నారు.

- కంటోన్మెంట్, మే 17

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్: ఆజామాబాద్ డివిజన్ 11కేవీ అహోబిల మఠం, సాయిబాబా టెంపుల్, జామై ఉస్మానియా, వైఎంసీఏ, అయ్యప్పటెంపుల్, శ్రీరామ్‌నగర్, అప్కో, ఇందిరానగర్, పటేల్‌నగర్, తిలక్‌నగర్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ ఎం. విజయభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## 'బాసర' అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల చేయాలి


విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి వినతిపత్రాన్ని అందజేసిన అనంతరం ఏఐఎస్ఎఫ్ నేతలు

హిమాయత్‌నగర్, మే 17: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఏర్పాటు చేసిన బాసర ట్రిపుల్ ఐటీలో అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంను ఏఐఎస్ఎఫ్ ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. బాసర ట్రిపుల్ ఐటీలో నెలకొన్న పలు సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. పూర్తిస్థాయి వైస్ ఛాన్సలర్‌ను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేశ్, ఉపాధ్యక్షుడు గ్యార క్రాంతి, రెహమాన్ పాల్గొన్నారు.




# వరదముంపు రాకుండా చర్యలు


మల్కాజిగిరి : బాలసరస్వతి నగర్ కాలనీలో డ్రైనేజీ కవర్లను తెరచి పూడిక తీయిస్తున్న మాజీ కార్పొరేటర్ జగదీశ్ గౌడ్


చిలుకానగర్‌లో పనులు పరిశీలిస్తున్న చిలుకానగర్ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల ప్రవీణ్ ముదిరాజ్

మల్కాజిగిరి, మే 17 : వరద ముంపు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ జగదీశ్ గౌడ్ అన్నారు. శుక్రవారం బాలసరస్వతినగర్ కాలనీలో నిలిచిన నీటిని సత్వర చర్యలు చేపట్టి తొలగించారు. డ్రైనేజీ కవర్ తెరచి పూడిక తీయడంతో పాటు మోటర్ వాహనంతో డ్రైన్లను క్లియర్ చేశారు.

ఈ సందర్భంగా జగదీశ్ గౌడ్ మాట్లాడుతూ.. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు బాలసరస్వతినగర్ కాలనీ నుంచి పారుతున్న నీటితో డ్రైన్ నాలా రిటైనింగ్ వాల్ కూలి ఉందన్నారు. వెంటనే స్పందించిన నాయకులు నీరుతో పాటు డ్రైనేజీ నీరు కాలనీలోకి రాకుండా చర్యలు తీసుకున్నామని, డ్రైనేజీ కవర్లను తెరచి పూడికను తీయించామని తెలిపారు. కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్, బాబు, ప్రవీణ్, శ్రీనివాస్, నీలం సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి ఇచ్చి ఆదుకోండి

ఖైరతాబాద్, మే 17: నగర పర్యాటకుల కోసం లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ప్రారంభానికి అనుమతిని ఇచ్చి ఆదుకోవాలని సమ్మర్ ఉత్సవ్ మేళా నిర్వాహకుడు మీర్జా రఫీక్ బేగ్ ప్రభుత్వాన్ని కోరారు. ఖైరతాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 ఏండ్లుగా హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో ప్రతి వేసవి ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నానని అన్నారు. ఈ ఏడాది కూడా 60 రోజుల మేళా కోసం హెచ్‌ఎండీఏకు రూ.63.18లక్షలు చెల్లించానని, జీహెచ్‌ఎంసీ, ఫైర్, లా అండ్ ఆర్డర్, ఆర్‌అండ్‌బీ శాఖల నుంచి క్లియరెన్స్ వచ్చిందన్నారు. అన్ని అనుమతులున్నా ట్రాఫిక్ అధికారులు పార్కింగ్ సరిగా లేదంటూ కొర్రీ పెట్టారన్నారు. మేళాలో ప్రతి ఏడాది దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి చేనేత, చేతి వృత్తిదారులు పొట్ట చేతపట్టుకొని తమ వృత్తులను వ్యాపారం చేసుకునేందుకు వస్తారని, నెల రోజులుగా మేళా ప్రారంభం కాక, వందలాది కిలోమీటర్ల దూరం నుంచి వచ్చిన చిరు వ్యాపారులు జీవనోపాధి లేక నష్టపోతున్నారని పేర్కొన్నారు.

అమ్యూజ్‌మెంట్ నిర్వహించే కార్మికులు సైతం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మేళా నిర్వహణ ద్వారా అనేక మంది కార్మికులకు జీవనోపాధి దొరుకుతుందని, ప్రస్తుతం వారి పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి తమను ఆదుకోవాలని కోరారు.






*అంతా అస్తవ్యస్తం:* గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి నగరం అతలాకుతలం అయింది. ఓ పక్క మండువేసవిలో వానలు పడడంతో సంతోషం వ్యక్తం చేస్తుండగా..మరోపక్క జూబ్లీ బస్‌స్టేషన్ వెనకప్రాంతం, బోయిన్‌పల్లిలోని సీతారాంపురం , తాడ్‌బండ్ చెక్‌పోస్ట్ దగ్గర రహదారులు అస్తవ్యస్తం, బురదమయం కావడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వచ్చేది వానకాలం కాబట్టి ఇబ్బందులు లేకుండా చూడాలని ముందస్తుగా స్థానిక ప్రజలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.